
# కేరక్టర్

ప్రతాప రవిశంకర



సరిగ్గా రేవతి స్కూలు నుంచి ఇంటికి వచ్చిన పదినిమిషా లకు ఆమెకు శిఖా మణి ఫోన్ చేసి మాట్లాడాడు. ఆ రాత్రి ఏడు గంటల తర్వాత ఆ వూరికి వస్తున్నట్టుగా రేవతికి చెప్పాడు.

శిఖామణితో ఫోన్‌లో మాట్లా డిన తర్వాత రేవతి పక్కనే వున్న ఇంటికి వెళ్లింది. ఆ ఇంట్లో వున్న శకుంతల గారికి తనని ప్రేమిం చిన శిఖామణి తన వూరి నుంచి అక్కడకు వస్తున్న విషయాన్ని చెప్పి సరిగ్గా రాత్రి ఏడు గంట లకు ఆమెను తన ఇంటికి తప్ప

కుండా రమ్మని చెప్పింది. ఆ తర్వాత తన ఇంట్లోకి వచ్చి బెడ్ మీద వాలిపోయింది.

అతను అంత హఠాత్తుగా ఎందుకు వస్తున్నాడనే ఆలోచన రేవతిలో లేదు. ఎందుకంటే ఆర్నెల్ల క్రితం ఇద్దరూ విడిపోయారు. ఉద్యోగరీత్యా రేవతి ఆ మండల కేంద్రానికి వచ్చి ఆ వూరి ఎలిమెంటరీ స్కూల్లోనే టీచర్‌గా జాయినయింది. తర్వాత ఈ ఆర్నెల్లలో వాళ్లిద్దరి మధ్య నాలుగయిదు ఉత్తరాలు చోటు చేసుకున్నాయి. నెల రోజుల క్రితమే రేవతికి టెలిఫోన్ కనెక్షన్ వచ్చింది. అప్పటి నుంచి ఓ మూడుసార్లు ఫోన్‌లో కుశలమూ, వగైరా....

తనని చూడాలని శిఖామణికి బలంగా అనిపించి వుండవచ్చు. అతను ఏదైనా అనుకుంటే ఆ పని చెయ్యడానికి ఆలస్యం చేసే మనిషి కాదు. ఈ విషయం రేవతికి బాగా తెలుసు. శిఖామణి గుంటూరులో ఓ ప్రభుత్వ కార్యాలయంలో ఉద్యోగం చేస్తున్నాడు. అతనికి ఇంకా పెళ్లికాలేదు. వాళ్ల వీధిలోనే వుండే రేవతితో కొన్నాళ్ల క్రితం ప్రేమలోకి దిగాడు. చదువుకున్న వాడు, ఓ మంచి ఉద్యోగం చేస్తున్నాడు. చూడడానికి కొంచెం బాగానే ఉండే శిఖామణి ప్రేమను తిరస్కరించే కారణం ఏదీ కనిపించక రేవతి కూడా అతన్ని ప్రేమించింది.

తండ్రి దగ్గర్నించి తన పెళ్లి గురించి ఉత్తరం రావడం వల్ల శిఖామణి రేవతితో తన పెళ్లి విషయం సత్వర నిర్ణయానికి వచ్చే విషయం గురించి ఆమె ఉద్యోగం చేస్తున్న వూరికి ప్రయాణం కట్టి తను వస్తున్న విషయాన్ని ముందుగా ఆమెకు తెలియజేశాడు. అంతకు మించి తన మనసులో ఏమీ లేదని ఆమెకు ఫోన్ చేస్తున్నప్పుడు కూడా అనుకున్నాడు. ఓ మూల నుంచి తలెత్తుతున్న ఏదో శంకను బలవంతంగా అదిమిపెట్టి.

ఆ పల్లెటూరిలో రేవతి రెండు గదులు, ముందు వరండా వున్న పెంకుటింట్లో అద్దెకు వుంటున్నది ఒంటరిగా. ఆమె ఆ ఇంట్లోకి వస్తున్నప్పుడు పక్కింట్లో వుండే శకుంతల అడిగింది రేవతిని.

''ఒక్కదానివే వుండడానికి భయంగా వుండదూ?''


పలుచగా నవ్వి ''భయమెందుకు పిన్నీ. మీరంతా వున్నారు గదా. నాకెందుకు భయం ''అంది రేవతి.

''చదువుకున్న ధైర్యం నీది'' మరలా అన్నది ఆమె.

''ధైర్యానికి చదువుతో నిమిత్తం లేదు పిన్నీ. నేను అడవిలో లేను. మీ పక్కన వున్నాను. అవసరానికి సహాయపడే మనుషులున్నారని అనుకున్నప్పుడు ఇంకెందుకు భయం. నేను మీ దాన్ని. మీరంతా నా వాళ్లు. ఈ ఫీలింగ్ నాకు ఎప్పుడూ వుంటుంది. ఈ ఫీలింగ్ వున్నంతకాలం నేను ఒంటరి దాన్ని కాదు. నన్ను నీ కూతురని అనుకో పిన్నీ నువ్వు మా అమ్మవు అనుకుంటాను.''

ఇలా అన్న రేవతికి పక్కింటి శకుంతల కాస్తా శకుంతల పిన్ని అయింది. ఇప్పుడు ఆ శకుంతల పిన్ని రేవతి కోరినట్లు గానే ఐదు నిమిషాల తక్కువ ఏడు గంటలకే రేవతి ఇంటికి వచ్చేసింది.

''పిన్నీ...నీకు శ్రమ ఇస్తున్నందుకు ఏమీ అనుకోవద్దు. ఇంకోరోజు ఎప్పుడైనా అవసరమైతే మీ




ఇంట్లో పనంతా నేను చేసిపెడతాను. ఇప్పుడు మాత్రం నువ్వు ఆ శిఖామణి గారు వచ్చిన తరువాత కొంచెం వంటచేసి ఆయనకు వడ్డించు. ఈ రాత్రికి మీ ఇంట్లో నీ పక్క మంచం మీద నిద్రపోయే అవకాశం ఇవ్వు.'' అన్నది నవ్వుతూ.

రేవతి అలా అనగానే శకుంతల ఇలా అడిగింది.

''ఇంతకీ ఆ శిఖామణి నువ్వు నిజంగా ప్రేమించుకున్నారా?''

''అవును పిన్నీ''

''పెళ్లి కూడా చేసుకునే ఆలోచనవుందా ఇద్దరికీ''

''ఉంది పిన్నీ ఐనా పెళ్లి చేసుకునే ఆలోచన లేనప్పుడు ప్రేమించుకోవడం ఎందుకు? దండగ'' అన్నది రేవతి పెద్దగా నవ్వుతూ.

అప్పుడు శకుంతల ఆశ్చర్యంగా అలా రేవతిని చూస్తూ వుండిపోయింది.

''ఏమిటి పిన్నీ! అలా చూస్తున్నావు?'' రేవతి అడిగింది.

''నువ్వు నిజంగా నా కూతురిగా పుడితే బావుండేదని''

''ఏం చేసేదానివేంటి?''

''జీవితాంతం నీకు ఆ శిఖామణికీ వంట చేసి పెడుతూ నీ దగ్గరే వుండేదాన్ని'' అన్నది శకుంతల

''థ్యాంక్స్ పిన్నీ... ఇప్పుడైనా సరే'' అన్నది రేవతి మళ్లీ చిన్నగా నవ్వుతూ...

''నువ్వు నిజంగా మంచి గడుసుదానివి.'' అన్నది శకుంతల

ఆమె అలా అన్నప్పుడే ఎవరో గేటునెట్టిన చప్పుడు ఆ తర్వాత ''ఇదే ఇల్లు'' అనే మాటలూ వినిపించాయి..

గేటు వైపు చూసినప్పుడు లోపలకు వస్తున్న శిఖామణి .రోడ్డు మీద వెనక్కు తిరిగి వెళుతున్న ఎవరో మనిషి కనిపించారు. అతను తన ఇల్లు చూపించి వుండకూడదనుకున్నది.

శిఖామణిని నవ్వుతూ తన ఇంట్లోకి ఆహ్వానించింది రేవతి. ఆ తర్వాత ''మా శకుంతల పిన్ని '' అంటూ ఆ పక్కింటి శకుంతలను అతనికి పరిచయం చేసింది.

''ఈ వూళ్లో నీకు బంధువులు వున్నట్లు ఎప్పుడూ చెప్పలేదేమిటి?'' అనడిగాడు శిఖామణి ముఖం చిట్లించి.

అతని ప్రశ్నకు రేవతి జవాబుగా అదోలా నవ్వింది.

వరండాలో ట్యూబ్‌లైటు ప్రకాశవంతంగా వెలుగుతోంది. చలికాలపు రాత్రి కావడంతో వరండాలో వున్న సీలింగ్ పంఖా శాపం పెట్టినట్టు కదలకుండా వుండిపోయింది.

''కాళ్లు కడుక్కోవడానికి నీళ్లివ్వు'' అన్నది శకుంతల అప్పుడే గుర్తుకు వచ్చినట్లు రేవతితో....

''వద్దులెండి...చలిగా వుంది...అవకాశం వుంటే వేడినీళ్లతో ఇప్పుడే స్నానం చేస్తాను.'' అన్నాడు శిఖామణి ప్రయాణ దూరాన్ని, భారాన్ని గుర్తుచేసుకుంటూ...

''వేడినీళ్లు పెడతాను'' అని అక్కడ నుంచి వెళ్లే ప్రయత్నం చేసింది రేవతి.

''నువ్వు కూర్చొని మాట్లాడుతూ వుండు. ఉదయం నుంచీ స్కూల్లో పిల్లలతో అరిచి అలసిపోయి వుంటావు. అంతా నేను చూసుకుంటాను'' అని లోపలకు వెళ్లింది శకుంతల.

''థ్యాంక్స్ పిన్నీ'' అన్నది రేవతి కృతజ్ఞతగా.

రేవతి, శిఖామణి కొంచెం సేపు ఆ వరండాలో మాట్లాడుకుంటూ కూర్చున్నారు. రేవతిని చూడాలనిపించి వెంటనే బయల్దేరి వచ్చినట్టుగా చెప్పాడు మాటల మధ్యలో. అంతే గానీ తన మనసులో వున్న అసలు విషయం బయటకు రాకుండా జాగ్రత్త పడ్డాడు. పెళ్లి గురించి అతను మాట్లాడతాడేమోనని రేవతి ఎదురుచూసింది. కానీ అలా జరగలేదు.

ఆ తర్వాత పనులన్నీ క్రమం ప్రకారం జరి



## జుత్తు పెంచాలని వుంది

తెరమీద కనిపించినంత మాత్రాన సంప్రదాయమూ, సంస్కృతుల మీద మమకారం పోతుందని మాత్రం ఎలా చెప్పగలం. ఒకవేళ మోడ్రన్‌గాళ్‌గా వుండచ్చుగానీ, లోలోపల మాత్రం భూమికకు కొన్ని కోరికలున్నాయి. నడుముల వరకూ జుత్తు పెంచుకోవాలని ఆశగా వుందట. అంతే కాదు, కొప్పునిండా పూలుపెట్టి తిరగాలని కూడా ఇష్టం. కానీ ఇష్టమున్నంత మాత్రాన అవి కుదరట్లేదని కూడా చెబుతోంది. ఎప్పటికైనా బారుగా జుత్తుపెంచి, మల్లెపూలు పెట్టి చక్కటి చీరకట్టుతో కనిపిస్తానని భూమిక ఘంటాపథంగా చెబుతోంది. జీన్స్‌లేసుకున్నంత మాత్రాన జుత్తుమీద మోజు వుండకూడదనా అని అంటోంది. ఇంతకీ భూమికకు మంచి టేస్టుందే అనుకుంటున్నారు.

గాయి. శిఖామణి వేడినీటితో స్నానం చేశాడు. అతను స్నానం ముగించిన కొంచెం సేపటికి శకుంతల వంట పని పూర్తిచేసింది. ఆ రాత్రి ఎనిమిది గంటలు దాటుతున్నప్పుడు శిఖామణికీ, రేవతికీ భోజనం వడ్డించింది.

భోజనానంతరం శిఖామణి...

''మళ్లీ రేపు ఉదయమే వెళతాను. ఓసారి ఊరంతా చూసి వస్తాను. కొంచెం నడిచినట్లు వుంటుంది. భోజనం చెయ్యగానే కొంచెం నడవడం అలవాటు'' అన్నాడు నిల్చుని...

''రాత్రి వేళ ఊరు చూస్తారా?'' అన్నది శకుంతల.

''వెన్నెలగా వుంది కదా... బావుంటుంది''అని చెప్పులు తొడుక్కుని బయటకు వెళ్లాడు శిఖామణి?

అతను వెళ్లిన తర్వాత శకుంతలకు మరోసారి కృతజ్ఞతలు తెలియజేసింది రేవతి.

ఆ తర్వాత కొంచెం సేపు శకుంతల కోరిన మీదట శిఖామణికీ తనకీ మధ్య జరిగిన ప్రేమాయణం గురించి రేవతి చెప్పింది.

''ఇంతకీ సినిమాలకు వెళ్లారా? లేదా?'' అడిగింది శకుంతల కుతూహలంగా.

''వెళ్లలేదు. ఒక్కసారి మాత్రం మా వెనక రోడ్డులో వున్న ఆంజనేయస్వామి గుడికి వెళ్లాం'' అన్నది రేవతి.

శకుంతల సన్నగా నవ్వుతూ ''బ్రహ్మచారి గుడికా!'' అన్నది.

''అవును పిన్నీ... ఇద్దరం బ్రహ్మచారులమేగా?'' అన్నది రేవతి.

ఈసారి పెద్దగానే నవ్వింది శకుంతల.

వారలా మాట్లాడుకుంటున్నప్పుడు శిఖామణి తిరిగివచ్చాడు.

''ఎలా వుంది మా ఊరు?'' అడిగింది రేవతి...

''పూర్తిగా పల్లెటూరి మాదిరిగానే వుంది.... ఆంజనేయస్వామి గుడిమాత్రం బావుంది'' అన్నాడు మెచ్చుకోలుగా...

అతను శకుంతల ఖాళీ చేసిన కుర్చీలో కూర్చున్నాడు.

''ఈ పల్లెటూరి జీవితం ఎలా వుంది?'' ఈ సారి శిఖామణి అడిగాడు రేవతిని.

''ప్రశాంతంగా బాగానే వుంది''

''పెళ్లయినా ఇక్కడే వుంటావా?'' మళ్లీ అడిగాడు షర్టును చేతులపైకి లాక్కుంటూ...

''నాదే ముంది? అంతా పతిదేవుడి దయ'' అన్నది తలవంచుకొని...

అప్పుడు శకుంతల కలగజేసుకుని...

''అమ్మాయ్... ఆయనకు పడక ఏర్పాటు చూడు'' అన్నది.

రేవతి లేచి వెళ్లి ఓ గదిలోకి వచ్చి వున్న మంచం మీద ఓ దుప్పటి పరిచి, పడక ఏర్పరిచి మళ్లీ వరండాలోకి వచ్చినిలుచున్నది.

''అబ్బాయ్... ఈ పక్కనే మా ఇల్లు. ఆయన పొద్దుటే వూరికి వెళ్లారు. రెండురోజులకు గానీ తిరిగిరారు. ఈ రెండు రోజులు రేవతి నాకు తోడుగా మా ఇంట్లో పడుకుంటుంది...సరేనా'' అన్నది శకుంతల.

తలూపాడు శిఖామణి అస్పష్టంగా..

''మరి నే వెళతాను.''అని ఆగి మళ్లీ ''మంచం పక్కనే బల్ల మీద ఫిల్టర్‌లో మంచినీళ్లున్నాయి'' అని శిఖామణికి చెప్పి శకుంతలతో బయల్దేరింది రేవతి.

''నేను రేపు పొద్దున మొదటి బస్సుకు వెళతాను. ఫస్టు బస్సు ఎన్ని గంటలకు వుంది?'' అని అడిగాడు శిఖామణి మొహం మాడ్చుకొని.

''పది నిమిషాలు తక్కువ ఆరుగంటలకు. అప్పటికి నేను వస్తాను లెండి గుడ్‌నైట్'' అని వెళ్ళిపోయింది రేవతి.

శకుంతలా వాళ్ళింట్లోకి వెళుతున్నప్పుడు

''అతడు ఏమనుకుంటాడో...కోపం వస్తుందేమో'' అన్నది శకుంతల.

''నేను వెండి అరిటాకును కాను పిన్నీ'' అన్నది జవాబుగా రేవతి.

విషయం తెలుసుకున్న శకుంతల భర్త భజసుందరరావు శకుంతలతో ఇలా అన్నాడు...

''ఆ శిఖామణికి తోడుగా పడుకోవడానికి నన్ను వెళ్లమంటావా?'' అనడిగాడు నవ్వుతూ శకుంతలతో...

''కథ చెడిపోతుంది వద్దు'' అన్నది శకుంతల.

ఆ రాత్రి రేవతి శకుంతల గదిలో పక్కనే వున్న మంచం మీద నిద్రపోయింది. తెల్లవారి అయిదున్నరకు శకుంతల రేవతిని నిద్రలేపింది. రేవతి వెళ్లేసరికి శిఖామణి బయల్దేరటానికి సిద్ధపడివున్నాడు.

''బస్సు వరకూ నేను కూడా వస్తాను'' అన్నది రేవతి.

''మీ పిన్నిగారు రావడం లేదా?'' హేళనగా అడిగాడు శిఖామణి.

''ఆమె రాదు లెండి నేను వస్తాను పదండి'' అని అతడితో బయల్దేరింది.

వాళ్లు వెళ్లేసరికి బస్సు బయల్దేరడానికి సిద్ధంగా వుంది.

శిఖామణికి వీడ్కోలు చెప్పి ఇంటికి తిరిగి వచ్చింది రేవతి. అప్పుడు అతను తన ప్రవర్తన గురించి ఏమనుకుంటాడు అనే ఆలోచన రేవతికి కలిగింది. కొంచెం సేపు ఆలోచించి చివరకూ ఏమయినా అనుకోనీ...తనకు తోచినట్టు తను చేసింది అనుకున్నది.

అప్పటికి బాగా తెల్లవారింది.

రేవతి స్కూలుకువెళ్లడానికి తయారవుతున్నప్పుడు శకుంతల వచ్చి కొంచెం సేపు కూర్చుని వెళ్లింది. వెళ్లబోయే ముందు ఆమె ఇలా అన్నది.

''అమ్మాయ్...నీ వైపునుంచి నువ్వు చేసింది సజావుగానే వుండొచ్చు. కానీ ఓ మగాడిగా అతడి వైపు నుంచి ఆలోచించు. అతడి మనసులో ఏమున్నదో మనకు తెలీదు. అతను కోపం తెచ్చుకొని నిన్ను పెళ్లి చేసుకోవడానికి వెనకడుగు వేస్తే...''

కానీ జరిగిందేమిటంటే...

స్కూలు నుంచి సరిగ్గా మధ్యాహ్నం భోజనానికి వచ్చిన ఐదు నిమిషాలకు రేవతికి శిఖామణి ఫోన్ చేశాడు.

''రేవతీ..రాత్రికి మా ఇంటికి వెళుతున్నాను. మా వాళ్లతో మాట్లాడి వీలయినంత త్వరలో మన పెళ్లికి ముహుర్తాలు పెట్టించమని చెబుతాను. సరేనా?'' అని అడిగాడు.

''మీ ఇష్టం. మరియు ధన్యవాదములు'' అన్నది రేవతి సంతోషంగా

''రేవతీ... మన పెళ్లికి మీ పక్కింటి పిన్నిగారిని తప్పకుండా రమ్మని చెప్పు... అని మళ్లీ రేవతి...నన్ను క్షమించు'' అన్నాడు కొంచెం నిజాయితీ ధ్వనిస్తున్న స్వరంతో.

''ఎందుకు?'' అని అడిగింది ఆశ్చర్యంగా. శిఖామణి జవాబు చెప్పకుండా ఫోన్ పెట్టేశాడు.

శిఖామణి ఆ వూరికి రేవతి కేరక్టర్ గురించి ఎంక్వయిరీ చేయడానికి వచ్చాడనీ, ఎటువంటి ఎంక్వయిరీ అవసరం లేకుండానే ఆమె కేరక్టర్ గురించి అతను గ్రహించాడనే విషయం రేవతికి భవిష్యత్తులో ఎప్పటికయినా తెలుస్తుందో... తెలియదో తెలీదు.

★

